# హలో... మీకో బహుమతి

-కె.వి.సుమలత

కామాక్షి అరగంట నుండి డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిలబడి రకరకాల భంగిమలలో తనను తాను చూసుకుంటోంది. పెళ్లికి ముందు సన్నజాజి మొగ్గలా నాజూకుగా ఉండే తను ఇద్దరు బిడ్డల తల్లయ్యేసరికి ముద్దుగా, బొద్దుగా గుండ్రాయిలా తయారయింది.

“బొండుమల్లె పువ్వులా ముద్దొస్తున్నావోయ్” అని కామేశం అంటుంటే లోలోపల మురిసిపోతూనే “మీరు మరీనూ?” అని చిరుకోపం ప్రదర్శించేది మొన్నమొన్నటివరకు.

“నందివర్ధనంలా సైజు మారిందోయ్” గాబరాగా భర్త అంటుంటే కాస్త కంగారుపడింది నిన్నటిదాకా.

“మమ్మీ! నువ్వు కితకితల సినిమా హీరోయిన్‌లా వున్నావని మా ఫ్రెండ్స్ వెక్కిరిస్తున్నారు” చిన్నా స్కూల్ నుండి రావడమే మొదలుపెట్టాడు ఈ రోజు.

“అవును మమ్మీ... నువ్వు బండదానిలా ఉన్నావుకదా. నేను అలా అయిపోతానని మా ఫ్రెండ్స్ అంటున్నారు” బిక్కమొహంతో అంది మున్నీ కోరస్ పలుకుతూ.

“కాస్త పొద్దునే లేచి వాకింగ్‌కి వెళ్లడమో, జిమ్ సెంటర్‌కు వెళ్లడమో, ఎక్సర్‌సైజులు చేయడమో చేయకూడదటోయ్... బద్దకమూ తగ్గుతుంది, ఒళ్లూ కరుగుతుంది” నిర్మొహమాటంగా చెప్తున్న కామేశం వంక నివ్వెరపోయి చూస్తోందిప్పుడు.

కామాక్షికి కూడా అందమంటే మక్కువే! కానీ టీవీ చూడడమంటే మరీ ఇష్టం. కామేశం ఆఫీసుకి, పిల్లలు స్కూలుకు వెళ్లేవరకూ కామేశం నోటికి దడిసి టీవీ పెట్టకుండా అతికష్టంమీద ఆగుతుంది.

“మేము వెళ్లేవరకు టీవీ జోలికి వచ్చావంటే మేము అన్యాయమైపోతాము. తరువాత నీ ఇష్టమే కాముడూ” కామేశం మాటలకు తల ఊపక తప్పింది కాదు కామాక్షికి.

తరువాత పనిమనిషికి ఇల్లప్పగించేసి హాయిగా మంచమెక్కేసి అన్ని ఛానల్స్‌కి న్యాయం చేస్తుంది. టిఫిన్, భోజనం, మధ్యమధ్యలో ప్లేట్లు ప్లేట్లు చిరుతిండి అన్నీ టీవీ ముందే! వండానా? లేదా? అన్నంత స్పీడ్‌గా వంటగదిలో నుండి కామాక్షి బయటకు వచ్చేస్తుంది.

“ఎప్పుడూ ఈ పప్పేనా? కాస్త మంచి కూరలు వండొచ్చుకదోయ్” కామేశం మాటలకు-

“నవ్య కర్రీ పాయింట్‌లో వెజిటబుల్ కర్రీస్ బాగుంటున్నాయంట. రమ్య స్వగృహ ఫుడ్స్‌లో రెండు కూరలు కొంటే రసం ఫ్రీగా ఇస్తున్నారుట. సిటీ ఛానల్‌లో చూపిస్తున్నారు” అంటుంది కామాక్షి కళ్లు రెపరెపలాడిస్తూ.

“నీ టీవీ పిచ్చిలో మా పొట్టలు మాడుస్తున్నావు” అని విసుక్కుంటూ కర్రీ పాయింట్‌ల చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు చేసేదేంలేక.

పెళ్లిరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా గుడికి వెళ్లిన కామేశానికి అక్కడ కొలీగ్ కనిపించాడు.

కుశల ప్రశ్నలయ్యాక “పిల్లల మాత్రమే కనిపిస్తున్నారు. మా సిస్టర్ రాలేదా?” అని కామేశాన్ని ప్రశ్నించాడు అతను.

“ఇదిగోరా ఇక్కడే ఉందిగా” అంటూ కామాక్షిని చూపించాడు కామేశం.

ఈసారి ఖంగుతినడం అతని వంతయింది. పాపం! ఆ అర్భకుడు కామాక్షిని పెళ్లిలోనే చూసాడు మరి.

ఆ రోజు నుండి కామాక్షికి తన అందంపట్ల చీమ కుట్టినట్లయింది. వాకింగ్‌లకు, జిమ్‌లకు వెళ్లి సమయం వృధా చేసుకోవడం సదరు కామాక్షికి నచ్చడంలేదు. టీవీ దగ్గరనుండి కదలకుండా ఒళ్లు తగ్గే మార్గాలకోసం అన్వేషణ ప్రారంభించింది.

‘ట్రింగ్...ట్రింగ్...’ మంటూ ల్యాండ్ ఫోన్ రింగయింది.

“ఎవరబ్బా ఇప్పుడు? ల్యాండ్‌ఫోన్‌కి చేసే బదులు సెల్‌కి చేయవచ్చుగా?” సణుక్కుంటూనే దొర్లుకుంటూ ఫోన్ దగ్గరకు వెళ్లింది కామాక్షి.

“హలో కామాక్షిగారా! నమస్తే మాడమ్. మేము గుంటూరు నుండి మాట్లాడుతున్నాము. మీ ఫోన్ నెంబర్‌కి లాటరీలో బహుమతి లభించింది.”

‘హలో’ అనడమే తడవుగా మాట్లాడే వ్యవధి లేకుండా అటువైపు నుండి అందమైన గొంతు పలకరించి మీకో బహుమతి వచ్చిందంటూ చెప్పగానే ఆశ్చర్యంతో ఉబ్బితబ్బిబ్బయింది కామాక్షి.

“మాకా? ఏం గిఫ్టు?” అని ప్రశ్నించేలోగానే ‘మీకు లభించిన బహుమతి సంఖ్య నమోదు చేసుకోండి’ అంటూ ఒక అంకె చెప్పింది.

వ్రాయడానికి పేపరు, పెన్ను సిద్ధం చేసుకునేలోగా ఆ గొంతు “మీకు ఉచిత బహుమతి కావాలంటే ఈ నెంబర్‌గల మొబైల్‌కు ఫోన్ చేయండి” అంటూ ఒక నెంబర్ చెప్పి ఫోన్ పెట్టేసింది.

ఏ సమయంలో ఏ సీరియల్ ఏ ఛానల్లో వస్తుందో అవలీలగా చెప్పగలిగే కామాక్షి ఫోన్ నెంబర్ గుర్తు పెట్టుకోలేకపోయింది.

అందుకు ఆ రోజంతా తనను తానే తిట్టుకుంటూనే వుంది. కామేశం ఇంటికి వచ్చాక జరిగినదంతా చెప్పి కిలోలకొద్దీ బాధపడింది కామాక్షి.

ఆ తరువాత రెండు రోజులు కామాక్షి

ల్యాండు ఫోన్ రింగయితే చాలు పరుగెత్తింది. కానీ ప్రయోజనం లేకపోగా ఆయాసం మిగిలింది.

వారం తరువాత తిరిగి అదే గొంతు, అదే పలకరింపుతో కాల్ వచ్చింది.

"నేను వారం రోజుల నుండి మీ ఫోన్ కోసం ఎదురు చూస్తూ ఉన్నానండీ" ఆదుర్దాగా అంటున్న కామాక్షి మాటలు పట్టించుకోకుండా బహుమతి సంఖ్య, ఫోన్ నెంబర్ చెప్పుంటే గబగబా ప్రక్కనే ఉన్న పుస్తకంలో నెంబర్లు వ్రాసుకుంది.

"థాంక్స్ అండీ" అంటున్న కామాక్షి మాటలు పూర్తి కాకుండానే అవతల ఫోన్ కట్ అయింది.

"వీళ్లకు మరీ కంగారెక్కువ" అనుకుంటూ ఆ నెంబర్‌కు ఫోన్ చేసింది.

"హలో... నేను కామాక్షినండీ" అంది కామాక్షి అటునుండి ఎవరో ఫోన్ తీయగానే.

"చెప్పండి మాడమ్ ఏం కావాలి మీకు?" అన్నాడు అతను.

"మాకు బహుమతి వచ్చిందని చెప్పి ఈ నెంబరిచ్చారండీ" గబగబా చెప్పింది కామాక్షి.

"కంగ్రాట్స్ కామాక్షిగారూ! మీకు వచ్చిన బహుమతి సంఖ్య చెబితే మా అసిస్టెంట్స్ వచ్చి మీకు అందజేస్తారు. మీ అడ్రస్ వివరంగా చెప్తారా మేడమ్" అన్నాడతను.

అంతే! ఆనందంతో ఉప్పొంగిపోయి కామాక్షి వివరంగా తమ అడ్రస్ చెప్పింది.

బహుమతి వస్తుందన్న ఆనందంతో పిల్లలకోసం కామేశం తెచ్చిన స్వీట్లు ప్లేటు నిండా పెట్టుకుని టీవీ ముందు సెటిలయింది.

***

సాయంత్రం ఇంటికొచ్చిన కామేశం ఖాళీ స్వీటు బాక్సులు కామాక్షి పక్క ఖాళీ ప్లేటు చూసి బుర్ర గోక్కున్నాడు.


"కాముడూ! మరీ అలా తిన్నావంటే మన గుమ్మాలు పెద్దవి చేయించాలేమోనే!" అన్నాడు.

"అంటే... నేను బాగా తింటున్నానని ఏడుపా?" గయ్‌మంది కామాక్షి.

"అది కాదే. అలా తినడం కూర్చోవడంలో మరింత లావయిపోతున్నావు. పోనీ అలా టీవీ చూస్తూనే ఆసనాలు వేయవచ్చుగా?"

"ఆసనాలు చూపించే సమయంలో మరో ఛానల్‌లో సీరియల్ వస్తుంది. ఎలా చేయగలను చెప్పండి. ఇక తిండి అంటారా? తగ్గిద్దామనే అనుకున్నా కానీ రోజు వాళ్ళు ఫోన్ చేసి మన అడ్రస్ తీసుకున్నారు. రేపు బహుమతి ఇస్తారంట. ఆ ఆనందంలో ఓ నాలుగు స్వీట్లు తిన్నాను అంతే" అంది తేలిగ్గా.

"వాడు ఏమిస్తాడో తెలియదుగానీ నిన్నయితే పట్టుకోలేకపోతున్నాము" మరోసారి



బుర్ర గోక్కున్నాడు కామేశం.

***

మరుసటిరోజు ఉదయం పదిగంటలకు కామాక్షి ఎక్కువసేపు ఎదురు చూడకుండానే నలుగురు యువకులు భుజానికి బ్యాగులు తగిలించుకుని ఇంటి ముంగిట వాలిపోయారు. కామాక్షి వీళ్లను సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి కాఫీ ఫలహారాలిచ్చింది.

కామాక్షి చూపులన్నీ వాళ్ల బ్యాగుల మీదనే. అది వాళ్లు గమనించి మాటిమాటికీ బ్యాగులు నిమురుకుంటూ శుభ్రంగా కామాక్షి పెట్టినవన్నీ లాగించారు.

ఆ తరువాత బ్యాగులో నుండి ఒక బెల్టు, కాయగూరలు కత్తిరించే పరికరాలు బయటకు తీసారు.

"ఏమిటవి?'' ఆశ్చర్యంగా ప్రశ్నించింది కామాక్షి.

"మీకు వచ్చిన బహుమతులండీ. నిజానికి వీటి విలువ మూడువేల పైచిలుకే. మీరు చాలా అదృష్టవంతులు. మీకు చాలా చౌకగా ఐదువందల ఎనభై తొమ్మిది రూపాయలకే ఇస్తున్నాము. ఎంత తక్కువ రేటులో వీటిని మీ స్వంతం చేసుకుంటున్నారో చూడండి.''

"అదేమిటి? ఫ్రీ గిఫ్ట్ అన్నారుగా? డబ్బులు అంటున్నారేమిటి?'' తిరిగి గడుసుగా ప్రశ్నించింది కామాక్షి.

"అవును. ఉచితమే కదండీ. అసలు రేటుకి మీరు తీసుకునే రేటుకు అసలు సంబంధం ఉందా? ఈ కత్తులు చూడండి... ఎంత షార్ప్‌గా, అందంగా ఉన్నాయో! మేడ్ ఇన్ జపాన్. ఎన్ని కూరగాయలైనా నిముషాల్లో కట్ చేయవచ్చు. సమయం ఎంతో ఆదా అవుతుంది. ఇకపోతే ఈ బెల్టు చూడండి. మా షాపింగ్‌లో ఆర్డర్ చేస్తే బుక్ చేసిన నెలరోజులవరకు దొరకడంలేదు. అదృష్టం మిమ్మల్ని వెతుక్కుంటూ గుమ్మం ముందుకు వచ్చేసింది. మీరేమనుకోనంటే ఇంకో మాట కూడా చెప్తాను మేడమ్'' వారిలో ఒకడు అన్నాడు.

"ఏమిటది?'' ఉత్సుకతగా అడిగింది కామాక్షి.

"మరేంలేదు మాడమ్. మీరు చాలా అందంగా ఉన్నారు. కానీ కాస్త బొద్దుగా ముద్దమందారంలా ఉన్నారు. ఈ బెల్టు ఉపయోగిస్తే అవలీలగా లావు తగ్గి నాజూగ్గా తయారవుతారు. ప్రస్తుతం సినిమా హీరోయిన్లు, టీవీ యాక్టర్లు బరువు తగ్గించుకునేందుకు ఉపయోగించేవి ఇవే. ఎక్కువగా కష్ట పడనవసరం లేకుండా బరువు తగ్గిపోవచ్చు. టీవీ చూస్తుండగానే ఖాళీ సమయాలలో బెల్టు వేసుకుంటే చాలు. మీరు వాడి చూడండి మేడమ్. మిమ్మల్ని చూసి మీ కాలనీ వాళ్లు ఆశ్చర్యపడకపోతే చూడండి''

'టీవీ చూస్తూనే' అన్న మాట కామాక్షి చెవుల్లోకి ముందు చొరబడింది. ఆనందంతో ముఖం చాటంత అయింది.

"ఉచితం అని చెప్పి ఇలా డబ్బులు...'' వదలకుండానే కాస్త బెట్టు చేసింది కామాక్షి.

"మాడమ్. మీరు తీసుకుంటున్నది ఉచితంగానే. పే చేస్తున్నది మాత్రం సర్వీస్ టాక్స్ అని అర్థం చేసుకోండి. మీ అందం కోసం ఆ మాత్రం చెల్లించలేరా? ఈ కూరగాయల కత్తులు వాడేటప్పుడు ఎంత సౌకర్యవంతంగా ఉంటాయో మీరే చూస్తారు!''

ఇంకేం మాట్లాడకుండా ఐదువందల ఎనభై తొమ్మిది రూపాయలు ఇచ్చి వాటిని స్వంతం చేసుకుంది కామాక్షి.

వాటిని ఎప్పుడెప్పుడు కామేశానికి, పిల్లలకు చూపిద్దామా అని ఎదురు చూస్తున్న కామాక్షి చేతిలో "ఇదిగోనోయ్! నీకోసం ఏం కొన్నానో చూడు'' అంటూ ఒక కవరు పెట్టాడు.

"ఏమిటండీ'' అంటూ విప్పి చూసింది కామాక్షి.

"బరువు తగ్గడానికి బెల్టు, కూరగాయలు కత్తిరించే కత్తులు. మా ఆఫీసుకి కొందరు కుర్రవాళ్లు తెచ్చి అమ్ముతుంటే కొన్నాను. టీవీ చూస్తూ కూరగాయలు కట్ చేయవచ్చు. బరువు తగ్గవచ్చు. ఖరీదు ఎంతో కాదు, రెండు వందల యాభై మాత్రమే'' కామాక్షి ముఖం చూడకుండానే చెప్తున్నాడు.

పాపం... కామాక్షి ముఖంలో అప్పటికే కత్తి వేటుకి నెత్తురు చుక్కలేదు.

★



## శాండ్ సేషన్- 2010

ఇటీవల బెర్లిన్‌లో జరుగుతున్న 'శాండ్ సేషన్-2010 అనే సైకత శిల్ప ప్రదర్శనలో పాల్గొనడానికి తన మూడుకోతుల ఇసుక శిల్పానికి తుది మెరుగులు దిద్దుతున్న ప్రఖ్యాత భారతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్.

## 38 భార్య, 94 పిల్లలు

మిజోరామ్‌లోని బక్త్వాంగ్ గ్రామంలో 66 ఏళ్ల జియోనాకి 38 మంది భార్యలు, 94 మంది సంతానం ఉన్నారు. అతని కొడుకుల్లో కొందరికి వివాహమై వాళ్లకి కూడా పిల్లలు కలిగారు. ప్రపంచంలో అత్యధిక కుటుంబాలలో ఒకటైన ఆ కుటుంబంలో 162మంది సభ్యులున్నారు. కొడుకులకి వేరే వేరే గదులున్నా అందరికీ ఒకే కిచెన్‌లో వంట. ప్రతిరోజూ వాళ్లింట్లో 35 కిలోల మాంసం కూర, 50 కిలోల అన్నం వండుతారు. కేవలం మూడువేలమంది మాత్రమే వుండే ఛనా జాతి కుటుంబాలు ఆ ఊళ్లో 350 ఇళ్లల్లో నివశిస్తున్నారు. అందరిలాగే జియోనా కుటుంబం కూడా తమ ఆదాయంలో 10 శాతం తమ జాతి అభివృద్ధి కోసం ఖర్చు పెడుతుందిట.

-తటవర్తి

